క్లుప్తంగా

పెండింగ్ వేతనాలు చెల్లించండి



కౌడిపల్లిలో ఎంపీడీఓకు వినతిపత్రం అందిస్తున్న ఈపంచాయతీ ఆపరేటర్లు

కౌడిపల్లి(నర్సాపూర్): గ్రామ పంచాయతీల్లో పనిచేసే ఈ పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని శుక్రవారం ఎంపీడీఓ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఈ పంచాయతీ ఆపరేటర్లు కిరణ్, అఖిల్ మట్లాడుతూ.. అయిదు నెలలుగా ఈ పంచాయతీ ఆపరేటర్లకు వేతనాలు రావడం లేదన్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా పనులు చేస్తున్న ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందన్నారు. పెండింగ్ వేతనాలు చెల్లించడంతో పాటు నిర్దిష్ట పనివేళ లు అమలు చేయాలన్నారు. జీవిత బీమా కల్పించి, పనిఒత్తిడి తగ్గించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ఈ పంచాయతీ ఆపరేటర్లు వెంకటేశం, సంతోష్, యాదయ్య పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన



అల్లాదుర్గం జెడ్పీ పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ, ఎంఈఓ

అల్లాదుర్గం(మెదక్): ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా అల్లాదుర్గంలోని పోలింగ్ కేంద్రాన్ని ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి, ఎంఈఓ ధనుంజయ్య శుక్రవారం పరిశీలించారు. అల్లాదుర్గం జెడ్పీ పాఠశాలలోని బూత్‌లో పోలింగ్‌కు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సిబ్బందికి ఆదేశించారు. ఓటర్లకు సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా నోడల్ అధికారి డాక్టర్ రమేశ్

శివ్వంపేట(నర్సాపూర్): విద్యార్థినులు ఆరోగ్యంపై వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని జిల్లా నోడల్ అధికారి డాక్టర్ రమేశ్ అన్నారు. శుక్రవారం శివ్వంపేట ఉన్నత పాఠశాలలో బాలికల సాధికారిక సదస్సు నిర్వహించారు. ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రత, రక్తహీనత, బ్రెస్ట్‌కాన్సర్, నెలసరి సమస్యలు, నులిపురుగుల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థినులకు సంబంధించి ఏదైన ఇబ్బందులుంటే గ్రీవెన్ సెల్‌ని ప్రభుత్వం ఏర్పాటు చేసిందని ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం బాలచంద్రం, సిబ్బంది, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

డంపుయార్డుతో ప్రజలకు ఇబ్బందులు



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

శివ్వంపేట(నర్సాపూర్): హైదరాబాదు నగర చెత్తను ప్యారానగర్‌లో డంప్ చేసేందుకు ప్రభుత్వం చేస్తున్న చర్యలతో శివ్వంపేట ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందని మాజీ జెడ్పీటీసీ మహేశ్‌గుప్తా శుక్రవారం అన్నారు. వారు మాట్లాడుతూ.. మండల శివారులోని గుమ్మడిదల మండలం ప్యారానగర్‌లో డంపుయార్డు ఏర్పాటుతో శివారులో ఉన్న మండల ప్రజలు కాలుష్య భారీన పడాల్సిన దుస్థితి ఏర్పడుతుందన్నారు. పచ్చని అటవీ ప్రాంతంతో పాటు వ్యవసాయ సాగుతో జీవిస్తున్న ప్రజలకు డంపుయార్డుతో నీటి, వాయు కాలుష్యంతో ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందని వాపోయారు. ప్రభుత్వం ఇప్పటికై న పునరాలోచించి 150 ఎకరాల్లో ఏర్పాటు చేస్తున్న డంపుయార్డు నిర్మాణం విరమించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, రాములుగౌడ్, యాదగిరి తదితరులు ఉన్నారు.

చెక్కుల పంపిణీ

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలో మండలంలో 25 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కును శుక్రవారం కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సత్యనారాయణ అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజిరెడ్డి, జీవన్, రమేశ్‌గౌడ్, రాజాసింగ్ పాల్గొన్నారు.

మహాలక్ష్మికి మహిళలు దూరం

- ఆటోలను ఆశ్రయిస్తున్న మహిళలు
- మంత్రి నియోజకవర్గంపై అధికారుల నిర్లక్ష్యం

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో చెప్పినట్లుగానే అధికారంలోకి రాగానే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఫ్రీ ప్రయాణం (మహాలక్ష్మి) పథకాన్ని అమలు చేసి చరిత్రను సృష్టించింది. అంతా బాగానే ఉన్నా కనీస బస్సు సర్వీసులు లేక చాలా మంది మహిళలు మహాలక్ష్మి పథకానికి దూరమవుతున్నారు. ఆటోలను ఆశ్రయిస్తూ అవస్థలకు గురవుతూ జిల్లా కేంద్రానికి ఎలా వెళ్లాలని ప్రశ్నిస్తున్నారు.

– రేగోడ్(మెదక్):

రేగోడ్ మండల కేంద్రం నారాయణఖేడ్ కేవలం 12 కిలోమీటర్ల దూరం ఉంది. ఖేడ్‌లో ఆర్టీసీ బస్సు డిపో కూడా ఉంది. ఖేడ్ నుంచి రేగోడ్ మీదుగా ఉదయం సదాశివపేట, పటాన్‌చెరుకు బస్సు సర్వీసులను నడుపుతున్నారు. సదాశివపేట బస్సు మినహా పటాన్‌చెరు బస్సు ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు రాదో తెలియకుండా ఉంది. బస్సుల కోసం నిరీక్షించి బస్సు రాకపోవడంతో ఆటోలను ఆశ్రయిస్తూ నానా అవస్థలకు గురవుతున్నారు. ఆర్టీసీ బస్సు డిపో ఉన్నా.. ప్రయాణికుల సౌకర్యార్థం కనీస బస్సులు లేకపోవడంతో మహిళలు మహాలక్ష్మి పథకానికి దూరమవడమే కాకుండా ఇబ్బందులకు గురవుతున్నారు. 65 కిలోమీటర్ల దూరంలోని సంగారెడ్డి ఆర్టీసీ బస్సు డిపో అధికారులు రేగోడ్ వరకు రోజూ ఉదయం, సాయంత్రం రెండు పూటలా బస్సు నడుపుతూ ప్రయాణికులకు సేవలందిస్తున్నారు. సంగారెడ్డి బస్సు ఒక్కరోజు బంద్రైన దాఖలాలు లేవు. ఇక మెదక్ ఆర్టీసీ బస్సుడిపో అధికారులు తమ ఇష్టారాజ్యానికి అంతే లేకుండా పోయిందని స్థానికులు మండిపడుతున్నారు.



ఆర్టీసీ బస్సు సర్వీసు

కొన్ని నెలలుగా బస్సులు రావడం లేదు

ఇరవై ఏళ్లకు పైగా రేగోడ్ వరకు నడిపిన బస్సు సర్వీసును ఇటీవల అడపాదడపా నడిపారని, కొన్ని నెలలుగా బస్సులు రావడం లేదని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బస్సులు నడపకపోతే జిల్లా కేంద్రానికి ఎలా వెళ్లాలని ప్రశ్నిస్తున్నారు. ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణం సురక్షితమని అధికారులు చెప్తున్నా.. బస్సులు మాత్రం సరిగా నడపడం లేదని ఆరోపిస్తున్నారు. పోచారం మీదుగా జహీరాబాద్, నిజామాబాద్ వెళ్లే బస్సులను రేగోడ్ వరకు నడపాలన్నారు. నియోజకవర్గంపై అధికారులు చిన్న చూపు చూడటంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి బస్సులు నడపాలని ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



రేగోడ్ నుంచి మెదక్, పట్నం పోవాలంటే ఇబ్బందులు తప్పడం లేదు. ఎంత సేపు ఉన్నా బస్సులు రాకపోడవంతో ఆటోల్లో పోతున్నాం. మెదక్ నుంచి రేగోడ్, ఖేడ్ నుంచి రేగోడ్ మీదుగా పట్నం వరకు అధికారులు బస్సులు వేయండి.

– వీరమ్మ, ప్రయాణికురాలు

బస్సులు నడపండి



రేగోడ్ నుంచి ఇతర గ్రామాలకు వెళ్లాలంటే సకాలంలో బస్సులు లేవు. ఉన్న బస్సులను నిలిపేశారు. బస్సులు లేక అనేక అవస్థలు పడుతున్నాం. పోచారం మీదుగా వెళ్లే జహీరాబాద్, నిజామాబాద్ బస్సులను రేగోడ్ వరకు నడపాలి. మెదక్, హైదరాబాద్ ప్రాంతాలకు బస్సులు నడిపితే సౌకర్యంగా ఉంటుంది.

– బుచ్చమ్మ, ప్రయాణికురాలు

పాఠశాలలో తాగునీటి ఎద్దడి



ఇంటి నుంచి వాటర్ బాటిల్స్ తెచ్చుకున్న విద్యార్థులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేట ఉన్నత పాఠశాలలో తాగునీటి ఎద్దడితో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలో 455 విద్యార్థులు చదువుకుంటున్నప్పటికీ తాగునీటి వసతి లేదు. దీంతో ఇబ్బందులు తప్పడంలేదు. విద్యార్థులు ఇళ్ల వద్ద నుంచి వాటర్ బాటిల్స్ తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. పాఠశాలకు సమీపంలో రక్షిత వాటర్ ట్యాంకులో మిషన్ భగీరథ నీరు అందుబాటులో ఉన్నప్పటికీ పాఠశాలకు తాగునీటి వసతి కల్పించేందుకు అవకాశం ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు చర్యలు చేపట్టడం లేదు. ముఖ్యంగా మధ్యాహ్న భోజనం వేళల్లో నీటి కోసం విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైన జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలకు మిషన్ భగీరథ నీరు అందేలా చర్యలు చేపట్టాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

విశ్వవిద్యాలయాన్ని ఆ భూముల్లో నిర్మించండి

తిరుమలనాథ ఆలయ ఛైర్మన్ రామ్‌రెడ్డి



నిజాంపేట(మెదక్): మండలంలోని చల్మెడ గ్రామ శివారులోని తిరుమలస్వామి ఆలయ సన్నిధిలోని ఎండోమెంట్ భూముల్లో కేంద్రీయ విశ్వవిద్యాలయాన్ని ప్రభుత్వం నిర్మించాలని తిరుమల స్వామి ఆలయ కమిటీ ఛైర్మన్ అక్కనపల్లి రాంరెడ్డి కోరారు. ఈ మేరకు శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల ప్రజల కోరిక మేరకు తిరుమలస్వామి ఆలయ ఎండోమెంట్ భూములు దాదాపు 282 ఎకరాల స్థలం ఉన్నందున ఈ స్థలంలో కేంద్రీయ విశ్వవిద్యాలయాన్ని నిర్మించాలని కోరుతున్నామన్నారు. విద్యాపరంగా మెదక్ జిల్లా వెనకబడిందని అందులో నిజాంపేట మండలం ఇంకా చాలా వెనుకబడి ఉన్నందున ఇక్కడ కేంద్రియ విశ్వవిద్యాలయాన్ని నిర్మించినట్లయితే నిరుద్యోగ యువతకు ఎన్నో ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. తిరుమల ఆలయ భూముల్లో 5 ఎకరాల స్థలాన్ని ఇవ్వడానికి మేము సిద్ధంగా ఉన్నామని, పాలకమండలి వర్గం సంపూర్ణ మద్దతు తెలుపుతుందన్నారు. ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు స్పందించి.. చల్మెడ తిరుమల స్వామి ఆలయం సన్నిధిలో కేంద్రీయ విశ్వవిద్యాలయాన్ని నిర్మించాలన్నారు. ఎమ్మెల్యే రోహిత్‌రావు ప్రత్యేక శ్రద్ధతో తగు చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నామన్నారు.

ప్రజలకు అండగా బీఆర్ఎస్

మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



సీఎంఆర్ఎఫ్ చెక్కు అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

పెద్దశంకరంపేట(మెదక్): ప్రజలకు బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ముసాపేట, జూకల్ తదితర గ్రామాలకు చెందిన పలువురికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతులకు, పేదలకు న్యాయం జరిగిందని, కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని మరిచిందన్నారు. ప్రజలు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నమ్మడం లేదన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎక్కువ స్థానాలు గెలిచేలా అందరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీనివాస్, సీనియర్ నాయకులు సురేశ్‌గౌడ్, మానిక్‌రెడ్డి, కన్నయ్యగారి రమేశ్, నర్సింలు, సుభాష్, విఠల్, వెంకట్‌రెడ్డి, యాదుల్‌హుస్సేన్ తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కొమురయ్య



చేగుంటలో మాట్లాడుతున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కొమురయ్య

చేగుంట(తూప్రాన్): ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కొమురయ్య అన్నారు. బీజేపీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కొమురయ్య శుక్రవారం పలు పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయులకు సంబంధించిన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 317 జీఓ సమస్య పరిష్కారం, అన్ని పాఠశాలల్లో ఒకే విధమైన పని వేళలు, పెండింగ్ డీఏ జీపీఎఫ్ విడుదలకు కృషి చేస్తానని తెలిపారు. గురుకుల పాఠశాలల సమస్యల పరిష్కారం, కార్పొరేట్ ఆస్పత్రుల్లో హెల్త్ కార్డులు పనిచేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవడానికి కృషి చేస్తానన్నారు. ఈ సమావేశంలో తపస్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేశ్, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, బీజేపీ నాయకులు గోవింద జానకిరాములు, రాకేశ్, వెంకటేశ్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బర్డ్‌ఫ్లూ వ్యాధిని అరికట్టడానికి చర్యలు

పశువైద్యశాఖ ఏడీ డాక్టర్ తిరుపతి



మాట్లాడుతున్న ఏడీ డాక్టర్ తిరుపతి

రామాయంపేట(మెదక్): బర్డ్‌ఫ్లూ వ్యాధిని అరికట్టడానికి ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని పశువైద్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ తిరుపతి అన్నారు. శుక్రవారం రామాయంపేట, నార్సింగి, నిజాంపేట మండలాలకు చెందిన పౌల్ట్రీ రైతులకు స్థానిక పశువైద్య కార్యాలయంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ... వ్యాధి ప్రబలే అవకాశం ఉన్నందున కోళ్ల ఫారాలు నడుపుతున్న రైతులు మందుస్తూ జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. కోళ్ల వ్యాధుల బారీన పడితే రైతులు సొంత నిర్ణయాలు తీసుకోకుండా వెంటనే తమకు సమాచారం అందజేయాలన్నారు. ఇది తీవ్రమైన వ్యాధిగా ప్రభుత్వం గుర్తించిందని, రైతులకు సహాయ సహకారాలు అందజేయడానికి మండలాల్లో పశువైద్యశాఖ డాక్టర్లు అందుబాటులో ఉంటారన్నారు. శనివారం మనోహరబాద్, తూప్రాన్, చేగుంట, చిన్నశంకరంపేట మండలాల పౌల్ట్రీ రైతులకు తూప్రాన్‌లో అవగాహన సదస్సు నిర్వహిస్తాన్నారు. కార్యక్రమంలో రామాయంపేట, నార్సింగి పశువైద్యశాఖ డాక్టర్లు శ్రీనివాసరావు, సుధాకర్ దేశ్‌ముఖ్, సిబ్బంది పాల్గొన్నారు.

యూజీడీలో వ్యర్థాలు వేయొద్దు

గజ్వేల్‌రూరల్: యూజీడీ(అండర్ గ్రౌండ్ డ్రైనేజీ)లో వ్యర్థాలను వేయడం వల్ల మురుగునీరు నిలిచిపోయి సమస్యలు తలెత్తే అవకాశముందని, ప్రజలు వ్యర్థాలను తమ ఇళ్ల వద్దకు వచ్చే పారిశుద్ధ్య వాహనాలకు అందించాలని మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య సూచించారు. 14వ వార్డులో యూజీడీలో తలెత్తిన సమస్యను శుక్రవారం పరిష్కరించారు. అదే విధంగా పట్టణంలోని దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి ప్లాస్టిక్ వినియోగిస్తున్న వారికి జరిమానా విధించారు.

రేషన్ బియ్యం పట్టివేత

తూప్రాన్: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు టోల్‌ప్లాజా వద్ద పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్ఐ శివానందం శుక్రవారం పేర్కొన్నారు. ఆయన కథనం మేరకు.. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు వచ్చిన నమ్మదగిన సమాచారం మేరకు తూప్రాన్ పట్టణ సమీపంలోని 44వ జాతీయ రహదారి టోల్‌ప్లాజా వద్ద తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో మేడ్చెల్ జిల్లా సూరారం నుంచి రామాయంపేటకు మినీ వ్యాన్‌లో 40 క్వింటాళ్ల బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. వ్యాన్‌తో పాటు బియ్యంను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. అనంతరం రెవెన్యూ అధికారులు పంచనామ నిర్వహించి బియ్యాన్ని ఓ రైస్‌మిల్లులో భద్రపరిచినట్లు తెలిపారు. వ్యాన్ డ్రైవర్ లక్ష్మణ్, బియ్యం కొనుగోలు చేసిన లింగంగుప్తపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అక్రమంగా నీటి తరలింపు

తూప్రాన్: మండలంలోని కిష్టాపూర్ హల్దీ వాగు నుంచి అక్రమంగా నీటిని తరలిస్తుండగా శుక్రవారం రైతులు అడ్డుకున్నారు. రైతుల కథనం మేరకు.. యావాపూర్ గ్రామ శివారులోని మామిడి తోటకు ఓ మాజీ బీఆర్ఎస్ నాయకుడి బంధువునని చెప్పుకుంటున్న ఓ వ్యక్తి గురువారం అర్ధరాత్రి యంత్రాల ద్వారా రోడ్డును ధ్వంసం చేసి పైపు లైన్లు ఏర్పాటు చేశాడు. హల్దీవాగు పరివాహక ప్రాంత రైతులు ఉదయం గమనించి ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇరిగేషన్ డిప్యూటీ ఈఈ శ్రీకాంత్ ఘటనా స్థలానికి చేరుకొని అక్రమంగా ఏర్పాటు చేసిన పైపులైన్లను తొలగించారు.

నెల రోజులకే కంకర తేలిన సీసీ రోడ్డు



కంకర తేలిన సీసీరోడ్డు

నర్సాపూర్: సిమెంట్ రోడ్డు వేసిన నెలరోజులకే కంకర తేలడంతో రోడ్డు నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించలేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. మున్సిపాలిటీలోని నాల్గవ వార్డు పరిధిలో ప్రభుత్వ హాస్టల్ నుంచి సుమారు వంద మీటర్ల పొడవు సిమెంట్ రోడ్డును నెల రోజుల క్రితం నిర్మించారు. మున్సిపల్ జనరల్ ఫండ్ నుంచి రూ.14లక్షలు మంజూరు చేశారు. నిధులు కేటాయించిన అధికారులు రోడ్డు వేసే సమయంలో పర్యవేక్షణ చేయకపోవడంతో నిర్మాణంలో నాణ్యత పాటించలేదని ఆరోపణలు వస్తున్నాయి. నెల రోజులకే సిమెంట్ కొట్టుకుపోయి కంకర తేలడంపై కాలనీవాసులు అధికారుల తీరుపై విచారం వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు కురిస్తూ రోడ్డు పూర్తిగా కొట్టుకుపోయే ప్రమాదం ఉందని ఆరోపిస్తున్నారు. సీసీ రోడ్డు సరిగా వేయని కాంట్రాక్టరుపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ రామకృష్ణరావును వివరణ కోరగా.. తమ ఏఈని పంపి నివేదిక తెప్పించుకొని పరిశీలిస్తానని చెప్పారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



ఉపాధ్యాయులతో విద్యార్థులు

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని సూరారం జెడ్పీపాఠశాలలో విద్యార్థులు శుక్రవారం స్వయంపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎంగా భవిత, కలెక్టర్‌గా ప్రణవి, డీఈఓగా శైలజ, ఎంఈఓగా జగన్ వ్యవహరించారు. ఈ సందర్భంగా జెడ్పీపాఠశాల హెచ్ఎం సాయిరెడ్డి, ఉపాధ్యాయులు విద్యార్థుల ప్రతిభను అభినందించారు.

విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలి

వందేమాతరం ఫౌండేషన్ వ్యవస్థాపక ధర్మకర్త రవీందర్‌రావు



మాట్లాడుతున్న రవీందర్‌రావు

కొల్చారం(నర్సాపూర్): ప్రభుత్వ పాఠశాల విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలని వందేమాతరం ఫౌండేషన్ వ్యవస్థాపక ధర్మకర్త రవీందర్‌రావు అన్నారు. మండలంలోని రంగంపేట ఉన్నత పాఠశాలలో మండల స్థాయి పదోతరగతి విద్యార్థులకు రవీందర్‌రావు ఆధ్వర్యంలో ప్రేరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం ఉపేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా విద్యాధికారి రాధాకిషన్, వక్తగా రవీందర్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలకు మరో 35 రోజులే సమయం ఉన్నందున విద్యార్థుల్లో పరీక్షలపై ఉన్న సందేహాలను, వాటిని అధిగమించేందుకు ఈ ప్రేరణ ఎంతో సహకరిస్తుందన్నారు. విద్యార్థి తన జీవితాన్ని ఉన్నత మార్గంలోకి తీసుకెళ్లేందుకు పదో తరగతి ప్రధాన భూమికగా నిలుస్తుందన్నారు. రవీందర్‌రావు మాట్లాడుతూ.. ప్రస్తుతం ఉన్నత ఉద్యోగాల్లో ఉన్నవారు ప్రైవేట్ విద్య నుంచి వచ్చిన వారేనని, ఈ వ్యవస్థ మారాలన్నారు. విద్యార్థుల ప్రగతిలో వారి తల్లిదండ్రుల పాత్ర కూడా ప్రధానమైందన్నారు. ప్రస్తుతం ఉన్న విద్యా వనరులను ఉపయోగించుకొని విద్యార్థులను వ్యవస్థలో ప్రతిభావంతులుగా తీర్చిదిద్దాల్సిన అవసరం ప్రతీ ఉపాధ్యాయుడిపై ఉండాలన్నారు. ఇష్టంతో చదివి, భవిష్యత్తును తీర్చిదిద్దుకోవడంతో పాటు తన తల్లిదండ్రులను సైతం గర్వపడేలా చేసినప్పుడే ఆ విద్యార్థికి గుర్తింపు అందుకుంటాడని వివరించారు. తమ ఫౌండేషన్ ద్వారా ఉన్నత శిఖరాలను అందుకున్న పేద విద్యార్థుల కథనాలతో విద్యార్థుల్లో ఆసక్తిని పెంపొందించారు.

విద్యార్థిని దత్తత తీసుకున్న ఉపాధ్యాయురాలు

పాఠశాలలో పదో తరగతి చదువుతున్న అక్షయ తల్లిదండ్రులు చనిపోయారు. దీంతో ఆ విద్యార్థినిని పాఠశాల ఉపాధ్యాయురాలు విజయనిర్మల దత్తత తీసుకున్నారు. విద్యార్థిని పాఠశాల స్థాయి నుంచి ఉన్నత విద్య ఉద్యోగ అవకాశం కల్పించే వరకు తోడుగా ఉంటానని చెప్పారు. కార్యక్రమంలో ఎంఈఓ సత్యనారాయణ, విశ్రాంత హెచ్ఎం రమేశ్‌బాబు, అమ్మ ఆదర్శ పాఠశాల కన్వీనర్ చండిప్రియా, ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ నీల కంఠుడికి మహా పడిపూజ

పాపన్నపేట(మెదక్): మండల పరిధిలోని నార్సింగిలో శుక్రవారం శివ మహా పడిపూజ నిర్వహించారు. గ్రామంలోని శివస్వాములు ఉదయం నీల కంఠుడి ఊరేగించారు. నృత్యాలు, భజనలు చేస్తూ పాటలు పాడుతూ తరలివెళ్లారు. స్థానిక హనుమాన్ దేవాలయం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మంటపంపై శివ పార్వతుల ప్రతిమలు ప్రతిష్ఠించారు. అనంతరం రుద్రాభిషేకం చేసి, పడిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో శివస్వాములు ప్రసాద్, నర్సింలు, గోపాల్‌రెడ్డి, చంద్రయ్య, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన శివస్వాములు పాల్గొన్నారు.

◆ క్యాలెండర్ ఆవిష్కరణ

కౌడిపల్లి(నర్సాపూర్): ఐకేపీ వీఓఏల సంఘం 2025వ సంవత్సరం క్యాలెండర్‌ను శుక్రవారం ఐకేపీ కార్యాలయం వద్ద వీఓఏల జిల్లా కార్యదర్శి ఏసు ఆవిష్కరించారు. వీఓఏలు మహిళ సంఘాల సభ్యులకు అందుబాటులో ఉండి ఆర్థిక అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. మండల వీఓఏల అధ్యక్షురాలు లలిత, సామేల్, శశిరేఖ, లాల్య తదితరులు పాల్గొన్నారు.

◆ ఎమ్మెల్సీ ఎన్నికలకు రెండు కేంద్రాలు

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల కోసం రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ మన్నన్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. టీచర్స్, గ్రాడ్యుయోట్స్ ఎమ్మెల్సీ పోలింగ్ కోసం జెడ్పీపాఠశాలలో వేర్వేరుగా రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండలంలో టీచర్స్ ఎమ్మెల్సీ ఓటర్లు 41, గ్రాడ్యుయోట్స్ ఓటర్లు 565 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు.

◆ మార్కండేయ ఆలయ వార్షికోత్సవాలు

అల్లాదుర్గం(మెదక్): అల్లాదుర్గంలోని మార్కండేయ ఆలయంలో 41వ వార్షికోత్సవాలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.

◆ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా చెరువులోకి నీరు



తూప్రాన్: పట్టణ సమీపంలోని కిష్టాపూర్ హల్దీవాగుపై ఏర్పాటు చేసిన గద్దర్ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా పెద్ద చెరువులోకి నీటిని మున్సిపల్ మాజీ చైర్పర్సన్ జ్యోతి శుక్రవారం విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పెద్ద చెరువు ఆయాకట్టు రైతుల సంక్షేమం కోసం హల్దీవాగు నుంచి నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం కొండపోచమ్మ సాగర్ నుంచి హల్దీవాగులోకి ఇటీవల నీటిని విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే పెద్దచెరువులోకి గద్దర్ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా విడుదల చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు భగవాన్‌రెడ్డి, నారాయణగుప్తా, కాంగ్రెస్ నాయకులు రవీందర్‌గుప్తా, కృష్ణ, నాగులు, నర్సింలు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

◆ రైల్వేశాఖకు చెందిన కాపర్ వైర్ చోరీ

రామాయంపేట(మెదక్): మండలంలోని అక్కన్నపేట రైల్వేస్టేషన్ వద్ద గోదాంలో ఉంచిన కాపర్ వైరు చోరీకి గురైంది. ఆలస్యంగా గమనించిన ఆశాఖ అధికారులు శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సుమారుగా రూ. లక్ష విలువైన కాపర్ వైరు చోరీకి గురైనట్లు వారు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

◆ రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రామాయంపేట(మెదక్): పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనుల దృష్ట్యా ఈనెల తొమ్మిదిన మున్సిపాలిటీ పరిధిలో కరెంట్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆశాఖ ఏఈ తిరుపతిరెడ్డి తెలిపారు. ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం వరకు కరెంట్ సరఫరా ఉండదని విజ్ఞప్తి చేశారు.

◆ ఆర్థికసాయం

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని మిర్జాపల్లి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ మహేశ్‌గౌడ్ అనారోగ్యంతో మృతి చెందగా తోటి ఆటో డ్రైవర్లు రూ. 5 వేల ఆర్థిక సాయం అందించారు. మిర్జాపల్లి ఆటో డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడు నర్సింలు గౌడ్ ఆధ్వర్యంలో యూనియన్ సభ్యులు నగదును వారి కుటుంబ సభ్యులకు అందించారు. ఎంఎస్ఓ ఆధ్వర్యంలో రూ. 5 వేల నగదును అందించారు.